మందుల పంపిణీలో అంతరాయం

● ఉరుకులు, పరుగులు పెట్టిన అధికారులు

ఖైరతాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం మందుల పంపిణీలో కాసేపు జరిగిన అంతరాయం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వచ్చింది. వెల్‌నెస్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, జర్నలిస్టులకు ఉచిత వైద్యంతో పాటు మందులను ఇస్తారు. మందుల పంపిణీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి అవసరమైన వారికి ఇస్తుంటారు. గురువారం ఇక్కడకు వచ్చిన ఓ వ్యక్తికి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ప్రకారం మందులు ఇవ్వాల్సి ఉండగా, ఇంటర్నెట్‌లో సాంకేతిక లోపం తలెత్తి నెట్ పనిచేయలేదు. దీంతో మందుల పంపిణీలో అంతరాయం కలిగింది. దీనిని కాస్త అక్కడ మందుల కోసం వేచి ఉన్న వారిని చూపుతూ వీడియో తీయడమేగాక, నెట్ బిల్లు చెల్లించకపోవడంతో బీఎస్ఎన్ఎల్ వారు కనెక్షన్ తొలగించారని, దీంతో వైద్యసేవలు నిలిచిపోయాయని, ఫార్మసీ వద్ద రోగులు పడిగాపులు కాస్తున్నారని సోషల్ మీడియాలో ఆ వ్యక్తి పోస్టు పెట్టాడు. అ ధికారులు మేమేం చేయలేమని చేతులెత్తేశారని ఆ పోస్టును వైరల్ చేయడంతో అది కాస్త ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో సీజేహెచ్ఎస్ ఈవో బాలకృష్ణ అక్కడకు వచ్చి ఆరా తీయగా ఇంటర్నెట్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందని, దానిపై ఫిర్యాదు చేస్తే వారు వచ్చి సరిచేశారని, కేవలం 20 నిమిషాల పాటు సేవల్లో అంతరాయం తలెత్తిందని గుర్తించారు. కాగా, వెల్‌నెస్ సెంటర్‌లో ప్రతి రోజూ 350 నుంచి 400 మందికి వైద్య సేవలందుతున్నాయని, అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని ఇన్‌చార్జి డాక్టర్ కీర్తి తెలిపారు.


ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్‌లో మందుల స్టాక్‌ను పరిశీలిస్తున్న బాలకృష్ణ


ఖైరతాబాద్‌లో ఒకే చెట్టుకు పూసిన 18 బ్రహ్మకమలాలను చూపిస్తున్న వీణామాధురి, అంబిక

ఒకే రోజున ఒకే చెట్టుకు 18 బ్రహ్మ కమలాలు

ఖైరతాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఒకే చెట్టుకు ఏకంగా 18 బ్రహ్మ కమలాలు విరబూశాయి. ఖైరతాబాద్‌లోని దానం దేవేందర్ అపార్టుమెంట్ 3వ అంతస్తులో నివసిస్తున్న బీజేపీ నగర నాయకురాలు సింగరి వీణామాధురి ఇంట్లో గురువారం రాత్రి ఒక్కసారిగా 18 బ్రహ్మకమలాలు విరబూశాయి. స్థానికులు పూజలు చేశారు. బ్రహ్మకమలాలు తమ ఇంట పూయడం అదృష్టంగా భావిస్తున్నామని వీణామాధురి, ఆమె సోదరి అంబిక, ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్ తెలిపారు. కాగా, గత సంవత్సరం సైతం ఇదే చెట్టుకు రెండు బ్రహ్మకమలాలు పూశాయి.

ఉత్సాహంగా ఇన్‌కమ్‌ట్యాక్స్ డే వాకథాన్



వాకథాన్‌లో ఆదాయపన్ను శాఖ అధికారులు, సిబ్బంది

ఖైరతాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆదాయపన్ను శాఖ 166వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పీవీ నరసింహారావు మార్గంలో ఆ శాఖ ఆధ్వర్యంలో గురువారం వాకథాన్ జరిగింది. పీపుల్స్ ప్లాజా నుంచి జలవిహార్ వరకు, తిరిగి పీపుల్స్‌ప్లాజా వరకు జరిగిన ఈ వాకథాన్‌ను శాఖ డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వర్, చీఫ్ కమిషనర్ సురేష్ త్రివర్ణ రంగులతో కూడిన బెలూన్‌లను ఎగురవేసి ప్రారంభించారు. ఈసారి 'అందరికీ ఆరోగ్యం' అనే నినాదంతో వాక్‌ను నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని వారు సూచించారు.

రోడ్డు ఆక్రమించి ప్రహరీ నిర్మాణం

● తనిఖీ చేసిన హైడ్రా

బంజారాహిల్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆక్రమించి ఓ వ్యక్తి ప్రహరీ నిర్మిస్తున్నాడని ఫిర్యాదు మేరకు గురువారం హైడ్రా అధికారులు తనిఖీలు చేపట్టారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎమ్మెల్యే కాలనీలో ప్లాట్ నెంబర్.224/ఎ యజమాని ఇటీవల నిర్మాణాలు మొదలు పెట్టారు. కాగా, రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నాడని కాలనీ సంక్షేమ సమితి, శ్రీ వెంకటేశ్వర కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి జీహెచ్ఎంసీ అధికారులు, హైడ్రాకు ఫిర్యాదు చేశారు. నిర్మాణదారుడు సామగ్రిని రోడ్డు మీద వేసి రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన హైడ్రా ఇన్‌స్పెక్టర్ నర్సింహారావుతో తనిఖీ చేశారు. ప్లాట్ యజమానిని పిలిచి డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.


ఎమ్మెల్యే కాలనీలో పర్యటిస్తున్న హైడ్రా అధికారులు

వృద్ధుడికి అరుదైన శస్త్ర చికిత్స



చికిత్స పొందిన వృద్ధుడితో వైద్యులు

బంజారాహిల్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో జారిపడి రెండు భుజాలు పనిచేయక ఇబ్బంది పడుతున్న వృద్ధుడికి బంజారాహిల్స్ రెనోవా సెంచరీ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఖమ్మం జిల్లా, ఖానాపురం హవేలి, రోటరీ నగర్‌కు చెందిన 62 ఏళ్ల వ్యక్తి జారి పడ్డాడు. నెల రోజులుగా రెండు భుజాలలో తీవ్రమైన నొప్పి, వాపు, రెండు చేతులను కదపలేకపోతున్నాడు. రెనోవా సెంచరీ ఆస్పత్రి వైద్యులను సంప్రదించగా 'బైలేటరల్ ప్రాక్సిమల్ హ్యూమరస్ ఫ్రాక్చర్' అని నిర్ధారించారు. దీనికి శస్త్ర చికిత్స ఒకటే మార్గమని వైద్యులు తేల్చి చెప్పారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ హిమాకాంత్ లాంగా బృందం వృద్ధుడికి శస్త్ర చికిత్స చేసి సాధరణ స్థితికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డా.విజయ్ కుమార్‌రెడ్డి, డా.అనూప్‌రెడ్డి సామ మాట్లాడుతూ ఎంతో సంక్లిష్టమైన శస్త్ర చికిత్సను 6-8 గంటల పాటు శ్రమించి పూర్తి చేసినట్టు చెప్పారు. రోగి కుటుంబసభ్యుల ఆర్థిక స్థితిని పరిగణలోనికి తీసుకోని సాధ్యమైనంత వరకు తక్కువ ఖర్చుతో ఎక్కడ రాజీ లేకుండా చికిత్స అందించామని చెప్పారు. సమావేశంలో డాక్టర్ ఏటీ సుహాస్ మసిలామణి, డా.విష్ణు, రవీంద్రనాథ్ గరగ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్, సంజయ్ నగర్‌లో కార్డన్ సెర్చ్

బోరబండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, సంజయ్ నగర్ బస్తీల్లో బోరబండ పోలీసులు బుధవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 220 ఇళ్లను తనిఖీ చేశారు. వెస్ట్‌జోన్ డీసీపీ ఎం.ఎస్.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన కార్డన్ సెర్చ్ అనంతరం ఎస్పీఆర్ హిల్స్ హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-2లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో వెస్ట్‌జోన్ అదనపు డీసీపీ గోవర్ధన్ మాట్లాడారు. ఈ సెర్చ్‌లో సరైన పత్రాలులేని 29 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహవాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లు లేకపోవడం, నెంబర్ ప్లేట్ మార్పు తదితర వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతిభద్రతలకు విఘాతం కల్పించవద్దని రౌడీషీటర్లకు సూచించామని చెప్పారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి నగర్ ఏసీపీ రాఘవేంద్ర రావు, బోరబండ ఇన్‌స్పెక్టర్ మొగిలిచర్ల సురేందర్‌గౌడ్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్ఐలు శేరి స్వప్నారెడ్డి, షేక్ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన-2025, నగర సోషలైట్, మిసెస్ ఇండియా ఆసియా పసిఫిక్ డాక్టర్ సుధా జైన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ జూలై 28 తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పనిబృందాలు తమ సిల్క్ హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.


వస్త్రోత్పత్తులతో డాక్టర్ సుధా జైన్


ఫలహారం బండి ఊరేగింపులో శివసేన బ్రదర్స్

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

అమీర్‌పేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శివసేన బ్రదర్స్ చెలిమెల శివసేన, కిశోర్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా జరిగింది. బంగారు నల్లపోచమ్మ ఆలయం నుంచి హనుమాన్ ఆలయం వాటర్ ట్యాంక్ మీదుగా అమీర్‌పేట నుంచి ఎల్లారెడ్డిగూడకు రాత్రి 10 గంటలకు ఊరేగింపు చేరింది. దారి పొడవునా యువకులు డప్పు వాయిద్యాలు, డీజే చప్పుళ్ల నడుమ నృత్యాలు చేశారు.

ఘనంగా తొట్టెల ఊరేగింపు

యూసుఫ్‌గూడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహ నగర్‌లో వ రుణ్‌సింగ్ చౌహాన్, రాజ్‌సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన అమ్మవారి తొట్టెల ఊరేగింపులో కాంగ్రెస్ పార్టీ యువనేత వి.నవీన్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమ్మరి వినయ్, సాయినాథ్, సంజయ్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


తొట్టెల ఊరేగింపులో నవీన్ యాదవ్

'మహవీర్ అవార్డ్స్' కోసం నామినేషన్ల ఆహ్వానం

బంజారాహిల్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించేందుకు మహవీర్ ఫౌండేషన్ దేశవ్యాప్తంగా అందించనున్న 29వ మహవీర్ అవార్డ్స్ కోసం తెలుగురాష్ట్రాల నుంచి నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్టు భగవాన్ మహవీర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ప్రసన్ చంద్ జైన్ తెలిపారు. ఈ నామినేషన్లను ఆగస్టు 30వ తేదీ వరకు స్వీకరించనున్నారు. అహింస, శాకాహారం, విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాల్లో నిస్వార్థంగా సేవలందిస్తున్న వ్యక్తులు, సంస్థలు ఈ అవార్డులకు అర్హులని ఆయన తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

● ఏడుగురు అరెస్ట్.. ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

అమీర్‌పేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై దాడి చేసిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు ఇద్దరు నిర్వాహకులతోపాటు ముగ్గురు విటులు, ఇద్దరు సెక్స్ వర్కర్లను అరెస్ట్ చేశారు. వీరి నుంచి ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన శంకర్ నాయక్, రెండో భార్య సరస్వతి ఎస్ఆర్‌నగర్‌లోని ఓ బేకరీ సమీపంలోని అపార్ట్‌మెంట్ 3వ పోర్షన్ అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజు రాథోడ్ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి దాడి చేశారు. ఇందులో ఉన్న విటులు గుంటూరుకు చెందిన ప్రదీప్, జగద్గిరిగుట్టకు చెందిన అనిల్, రాహుల్, ఇద్దరు సెక్స్‌వర్కర్లతోపాటు నిర్వాహకులు శంకర్ నాయక్, సరస్వతిని అదుపులోకి తీసుకున్నారు. ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య

అమీర్‌పేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజు రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన దేవి(23) జయంత్ లాల్ దంపతులు. కొంతకాలం క్రితం నగరానికి వచ్చారు. జయంత్ లాల్ అమీర్‌పేట అన్నపూర్ణ బ్లాక్ రెండో అంతస్తులో కంప్యూటర్ పరికరాలు(స్పేర్ పార్ట్స్) విక్రయించే వ్యాపారం చేస్తూ సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. వివాహం అయినప్పటి నుంచి అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. బుధవారం ఎప్పటిలాగే షాపునకు వెళ్లి మధ్యాహ్నం భోజనం చేసేందుకు వచ్చాడు. దేవి ఉరేసుకుని కనిపించింది. అప్పటికే మృతిచెందినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. రాజస్థాన్‌లో ఉండే దేవి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. గాంధీ ఆస్పత్రికి చేరుకున్న మృతురాలి సోదరుడు కృష్ణ తన బావ వేధింపులు భరించలేక సోదరి ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు జయంత్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

సోమాజిగూడ మలబార్ గోల్డ్ షాప్‌లో చోరీ

● 47.983 గ్రాముల బంగారు గొలుసు అపహరణ

పంజాగుట్ట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సోమాజిగూడ మలబార్ నగల దుకాణానికి వచ్చిన ఓ మహిళ సిబ్బంది కళ్లుగప్పి సుమారు ఆరు లక్షల రూపాయల విలువ చేసే బంగారు గొలుసును కాజేసింది. అసలు గొలుసు స్థానంలో నకిలీ గొలుసు పెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 28న రాత్రి మలబార్ నగల దుకాణానికి బురఖా ధరించిన ఓ మహిళ వచ్చింది. బంగారు గొలుసు కావాలని అడిగింది. దుకాణం సిబ్బంది ఆమెకు వివిధ శ్రేణుల్లో బంగారు గొలుసులు చూపించారు. సిబ్బంది దృష్టి మరల్చి 47.983 గ్రాముల బంగారు గొలుసును దొంగిలించింది. దాని స్థానంలో తన వద్ద ఉన్న నకిలీ గొలుసును పెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయింది.షోరూమ్‌లోని అన్ని నగల ఆడిటింగ్ నిర్వహించగా, బంగారు గొలుసు బరువులో తేడా వచ్చింది. దీంతో సిబ్బంది దానిని క్షుణ్ణంగా పరిశీలించగా అది నకిలీది అని తేలింది. 29న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా 28న వచ్చిన మహిళ బంగారు గొలుసు కొట్టేసి దాని స్థానంలో నకిలీ గొలుసు పెట్టినట్టు గమనించారు. ఈనెల 19న షోరూమ్ సిబ్బంది పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ మాయం.. కూతురుపై ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాయమైంది. కూతురుపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయిలపాక భారతీదేవి అమీర్‌పేట గురుద్వార్ వెనుక గల్లీకి చెందిన తన్మయిని దత్తత తీసుకుంది. ఈనెల 16న ఆమె ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. తిరిగి ఇంటికి వచ్చిన తన్మయి 21న కొంపల్లిలోని స్నేహితుల ఇంటికి చెప్పకుండానే వెళ్లింది మళ్లీ ఫిర్యాదు చేసి భరోసా కేంద్రం ద్వారా బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 21న భారతీదేవి పనిచేస్తున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చి మళ్లీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. 22న తల్లి సెల్‌ఫోన్ కనిపించలేదు. కూతురు తీసుకుపోయి ఉంటుందని పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది.

'ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలి'

పంజాగుట్ట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వారికి పోటీ చేసే అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర పోరాట కమిటీ అధ్యక్షుడు అభిమాన్ గాంధీ నాయక్ ధరావత్ డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దుర్మార్గంగా ఉమ్మడి రాష్ట్రంలో తీసుకొచ్చిన 21(3) 1995 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేడు జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఈ చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి కీర్తిలతగౌడ్, కొండా సమ్మయ్య పాల్గొన్నారు.

'మద్యం దుకాణాలు, బార్లలో రిజర్వేషన్లు కల్పించాలి'

పంజాగుట్ట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కల్లుగీత సొసైటీలకు మద్యం దుకాణాలు, బార్లలో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఆ తర్వాతనే నోటిఫికేషన్ ఇవ్వాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. ఏపీలో ఇస్తున్నట్టుగా రెంటల్, డిపాజిట్‌లో 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని కమిటీ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టె విజయ్ కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ జి.విజయ్ కుమార్‌గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. వచ్చే నెలలో రాష్ట్ర ప్రభు త్వం మద్యం దుకాణాలకు టెండర్లు పిలవాలని ప్రయత్నిస్తున్నట్టు తమకు సమాచారం ఉందని అన్నారు. సమావేశంలో గౌడ సంఘాల నాయకులు ఎస్.దుర్గయ్యగౌడ్, వేములయ్యగౌడ్, నగేష్‌గౌడ్, కీర్తిలతగౌడ్, నవీన్‌గౌడ్, అనిల్‌గౌడ్, వెంకటేష్, యాదగిరి పాల్గొన్నారు.

అమావాస్య అన్నదానం

అమీర్‌పేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం అమావాస్యను పురస్కరించుకుని అమీర్‌పేట వాసవీ క్లబ్ అధ్యక్షుడు, బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు సింగారపు శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు
స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ

పంజాగుట్ట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాల్లో ఉపాధి, పని నిమిత్తం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వలస వస్తున్నారని, వారి పిల్లలను పాఠశాలలో చేర్పించి వారికి మాతృభాషతో పాటు ఆంగ్ల మాధ్యమంలో చదువు చెప్పించడమే తమ లక్ష్యం అని బీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బీఎస్ రామ్మోహన్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డబుట్ లెస్ ఇంగ్లిష్ స్పీకింగ్ కోర్సు పుస్తక రచయిత యూఎస్‌శర్మ, ట్రస్టు ప్రతినిధి విఠల్‌రెడ్డితో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి, ఎంఈఓల అనుమతితో ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లాలోని షామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలోని ఎంపిక చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8 నుంచి పదవ తరగతి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. 2018లో ప్రారంభమైన తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, రిఫామ్స్‌కు అనుగుణంగా పలు సూచనలు, సలహాలు ఇస్తున్నామని తెలిపారు. అనంతరం రచయిత యూఎస్ శర్మ ఇంగ్లిష్‌కు సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు.

ఇస్రో అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ కెరీర్ వృద్ధికి, భవిష్యత్ ప్రయత్నాలకు ఇస్రో అందించే అవకాశాలు, సౌకర్యాలను ఉపయోగించుకోవాలని ఎన్ఆర్ఎస్‌సీ, పీపీఈజీ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్రశేఖర్ సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం (ఈసీఈ) నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ), ఇస్రో సహకారంతో గురువారం "నేషనల్ స్పేస్ డే 2025"ను ఘనంగా నిర్వహించింది. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథి ఎన్ఆర్ఎస్‌సీ, టీఈఓజీ గ్రూప్ హెడ్ డాక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇస్రో సాధించిన విభిన్నమైన మిషన్ల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగం కన్వీనర్ ప్రొఫెసర్ పి.నవీన్ కుమార్, ఇస్రోలోని ఎన్ఆర్ఎస్‌సీ, ఎస్‌పీఓడీ హెడ్ డాక్టర్ ఆర్.శ్రీనివాస్, విద్యార్థులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.


కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియం రేకులపైన రంధ్రాల నుంచి కారుతున్న వాన నీటిని సిబ్బంది బకెట్‌లలో నింపి పారబోశారు. ఈ చిత్రాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.
● యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

ఉద్యోగుల మధ్య స్నేహం పెంపునకు క్రీడా పోటీలు

యూసుఫ్‌గూడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల మధ్య స్నేహభావం పెంపొందించి, క్రీడాస్ఫూర్తి నింపడంతోపాటు శారీరక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని పవర్ గ్రిడ్ సథరన్ రీజియన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోమన్ యాదవ్ అన్నారు. పవర్ గ్రిడ్ సథరన్ రీజియన్-1, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే అంతర్ ప్రాంత బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025 గురువారం యూసుఫ్‌గూడ కె.వి.బి.ఆర్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడలో వేగం, నైపుణ్యం, ప్రశాంతంగా ఉండడం, వ్యూహం లాంటివి కీలకమన్నారు. పవర్ గ్రిడ్ చీఫ్ జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌లో అప్రమత్తత, క్రమశిక్షణ, శక్తి అవసరమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి కె.వంశీధర్, అసిస్టెంట్ సెక్రటరీ పి.ఎల్.వి కుమార్ పాల్గొన్నారు.


వందన సమర్పణలో క్రీడాకారులు, పవర్ గ్రిడ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న దోమన్ యాదవ్(ఇన్‌సెట్‌లో)


ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో రుద్రహోమం నిర్వహిస్తున్న పడింతులు

మహాకాళి ఆలయంలో రుద్రహోమం

సికింద్రాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అమావాస్యను పురస్కరించుకుని గురువారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో రుద్రహోమం పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజలో అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నేడు అమ్మవారికి సాకల సమర్పణ

బోనాల జాతర రంగం కార్యక్రమంలో భవిష్యవాణి చెప్పిన ప్రకారం శుక్రవారం శ్రీమహాకాళి అమ్మవారికి పప్పు, బెల్లంతోపాటు దేవస్థానం నుంచి సాకలు సమర్పించనున్నట్లు గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. ఐదు శ్రావణ శుక్రవారాలు పప్పు, బెల్లం, సాకలు సమర్పించనున్నట్లు, భక్తులు కూడా తమ ఇళ్లలో సాకలు తయారు చేసుకుని ఆలయానికి వచ్చి, అమ్మవారికి సమర్పించాలని ఆయన సూచించారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పాండు యాదవ్, విద్యావతి

కంటోన్మెంట్ 6వ వార్డులో అన్నదానం

బోయినపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లోని 6వ వార్డు నందమూరినగర్‌లో అమావాస్యను పురస్కరించుకుని స్థానిక పోచమ్మ ఆలయంలో బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ దేవాలయాల సంరక్షణ కోసం కృషి చేయాలని, అదేవిధంగా దేవాలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

బోయినపల్లిలోని నల్లపోచమ్మ ఆలయంలో..



అమావాస్యను పురస్కరించుకుని బోయినపల్లిలోని నల్ల పోచమ్మ ఆలయంలో అగార్వాల్ సేవ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్
- బోయినపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి)


వాహనదారుడికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

ఆలుగడ్డబావి వద్ద డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష

బౌద్ధనగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలుగడ్డబావి వద్ద గురువారం ఉదయం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్సైలు ద్విచక్ర వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 24వ తేదీ వరకు ఉదయం వేళ నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో 18మంది, రాత్రి వేళ నిర్వహించిన పరీక్షల్లో 17మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బానుక నర్మద, తదితరులు

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మారేడుపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ పరిధిలోని 4వ వార్డులో గల శివ అరుణ్ కాలనీ, పిట్టలబస్తీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కంటోన్మెట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు నిధులు రూ.22 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్, అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో శివ అరుణ్ కాలనీ అధ్యక్షుడు ప్రకాష్‌రావు, బీజేపీ వార్డు అధ్యక్షులు సచిన్, సీనియర్ నాయకులు శంకర్, బీజేపీ కన్వీనర్ విజయానంద్, నాగభూషణంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆలుగడ్డబావి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన నీరు

రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు నిలువకుండా చర్యలు తీసుకోండి

చిలకలగూడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ ఆలుగడ్డబావి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లోతట్టు ప్రాంతం కావడంతో రైల్‌నిలయం నుంచి చిన్న పాటి వర్షానికే నీరు వచ్చి నిలుస్తోంది. తరచూ డ్రైనేజీ పొంగడంతో మురుగు నీరు, రైళ్లు శుభ్రం చేసిన నీరు పైనుంచి వస్తుండడంతో సంవత్సరం పొడవునా నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు


బోయినపల్లి మార్కెట్ రోడ్డుపై ఏర్పడ్డ గుంత


కంటోన్మెంట్ పైగా కాలనీలో..


తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్ సమీపంలో..

ఎడతెరిపిలేని వర్షం.. రోడ్లు ఛిద్రం

వాహనదారులు, పాదచారుల అవస్థలు

సికింద్రాబాద్/బౌద్ధనగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సికింద్రాబాద్, కంటోన్మెంట్‌లోని రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ప్రధాన, అంతర్గత రహదారులన్నీ గుంతలమయంగా మారుతున్నాయి. దీంతో బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం కురిసేటప్పుడు.... ఈ గుంతల్లో పడి ఏ క్షణంలో ఎవరి ప్రాణాల మీదకు వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సికింద్రాబాద్‌లో..

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి డివిజన్లో షాబాద్‌గూడ, మహ్మద్‌గూడ, శ్రీనివాస్‌నగర్, బ్రాహ్మణబస్తీ, మేడిబావితో పాటు బౌద్ధనగర్ డివిజన్లో మార్కండేయనగర్, అంబర్‌నగర్, ఎల్.ఎన్.నగర్, బౌద్ధనగర్, తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. బౌద్ధనగర్ ఎస్ఎంఆర్ కాంప్లెక్స్ వద్ద మ్యాన్‌హోల్స్ కుంగి ప్రమాదకరంగా ఉంది. వారాసిగూడ జవహర్ వీఎన్ హైస్కూల్ లేన్‌లో రోడ్లు కుంగి దెబ్బతిన్నాయి.

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మొత్తం 8 వార్డుల్లోని అంతర్గత రోడ్లు దెబ్బ తిన్నాయి. బోయినపల్లి, రసూల్‌పురా, అన్నానగర్, అర్జున్‌నగర్, విమాన్‌నగర్, పైగా కాలనీ, బాలంరాయి, కార్ఖాన, పికెట్, కాకాగూడ, వాసవీనగర్, మహేంద్రాహిల్స్, తాడ్‌బండ్, సిక్‌విలేజీ, మడ్‌ఫోర్టు, తిరుమలగిరి, లాల్‌బజార్, బొల్లారం తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల్లో రోడ్లు గుంతలమయంగా మారి వర్షపు నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు తగ్గిన వెంటనే ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సికింద్రాబాద్, కంటోన్మెంట్ అధికారులకు స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


కంటోన్మెంట్ టెంపుల రాక్ ఎన్‌క్లేవ్‌లో రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు


వారాసిగూడ జవహర్ వీఎన్ హైస్కూల్ లేన్‌లో దెబ్బతిన్న సీసీ రోడ్డు


మహ్మద్‌గూడ ప్రధాన రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షపునీరు


కంటోన్మెంట్ విమాన్‌నగర్‌లో...


రసూల్‌పురాలో రోడ్డుపై చేరిన మట్టి, కంకర


బౌద్ధనగర్ ఎస్ఎంఆర్ కాంప్లెక్స్ వద్ద కుంగిన మ్యాన్‌హోల్


అధ్వాన్నంగా మారిన వారాసిగూడ నుంచి అంబర్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డు

వేగంగా రేషన్‌కార్డు దరఖాస్తుల వెరిఫికేషన్

బౌద్ధనగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లో రేషన్‌కార్డు దరఖాస్తుల వెరిఫికేషన్ వేగవంతంగా సాగుతోంది. పౌరసరఫరాల శాఖ సర్కిల్ 9 కార్యాలయం పరిధిలో సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో చురుకుగా సాగుతోంది. చిలకలగూడ, నామాలగుండు, సీతాఫల్‌మండి, మేడిబావి, ఇందిరానగర్‌కాలనీ, వారాసిగూడ, షాబాద్‌గూడ, మహ్మద్‌గూడ, మధురానగర్‌కాలనీ, తదితర ప్రాంతాలకు చెందిన వారు చాలామంది వార్డు కార్యాలయాల్లో, మీసేవ కేంద్రాల్లో నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సర్కిల్-9 పరిధిలో ఆరువేల రేషన్‌కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. సిబ్బంది తక్కువగా ఉండడంతో రేషన్‌కార్డు దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియగా మందకొడిగా సాగింది. ఇటీవల హైదరాబాద్ కలెక్టర్ జీహెచ్ఎంసీ యూసీడీ విభాగాల్లో పనిచేసే ఆర్‌పీలను రేషన్‌కార్డుల వెరిఫికేషన్ కోసం ఉపయోగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.


బౌద్ధనగర్‌లో ఓ ఇంటి వద్ద ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ అధికారి ఉత్తేజ్

సర్కిల్-9 అధికారి చాముండేశ్వరి ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, ఆర్‌పీలు రేషన్‌కార్డుల వెరికేషన్‌ను వేగవంతం చేశారు. ఆయా ప్రాంతాల్లో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు, తదితర పత్రాలను తనిఖీ చేస్తున్నారు. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్‌లు చేసి ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లులు తీసుకుని బౌద్ధనగర్ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయానికి రావాలని సూచిస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 300 దరఖాస్తులను తనిఖీ చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ఉత్తేజ్ తెలిపారు. అన్ని పత్రాలు సరిగ్గా ఉంటే రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని, లేదంటే రిజక్ట్ చేస్తున్నామని ఆయన తెలిపారు.

క్రీడలతో మానసిక దృఢత్వం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న టీటీటీఏ జీఎస్ పటేల్ నాగేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ జ్యోతి

మారేడుపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ (టీటీటీఏ) జనరల్ సెక్రటరీ పటేల్ నాగేందర్‌రెడ్డి అన్నారు. గురువారం సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 13వ రుక్మిణిబాయి స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని పటేల్ నాగేందర్‌రెడ్డి, పాఠశాల సెక్రెటరీ కరస్పాడెంట్ పి.జ్యోతి మధుసూదన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కరస్పాడెంట్ జ్యోతి మాట్లాడుతూ.. జంట నగరాల్లోని 120 పాఠశాలల నుంచి సుమారు 1000 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు, పతకాలు అందజేస్తామని వివరించారు. మూడు రోజులపాటు ఈ క్రీడా పోటీలు కొనసాగనున్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైక్రియాటిస్ట్ చంద్రచూడ్, సీహెచ్ అరవింద్, డైరెక్టర్లు స్వాతి పంపాల్కర్, పూజ పంపాల్కర్, అకాడమీ డైరెక్టర్ అగస్టీన్, హరినాథ్, కోచ్ లక్ష్మీకాంత్, స్కూలు ప్రిన్సిపాల్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

- ఏడుగురు అరెస్ట్.. ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

అమీర్‌పేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై దాడి చేసిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు ఇద్దరు నిర్వాహకులతోపాటు ముగ్గురు విటులు, ఇద్దరు సెక్స్ వర్కర్లను అరెస్ట్ చేశారు. వీరి నుంచి ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన శంకర్ నాయక్, రెండో భార్య సరస్వతి ఎస్ఆర్‌నగర్‌లోని ఓ బేకరీ సమీపంలోని అపార్ట్‌మెంట్ 3వ పోర్షన్ అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజు రాథోడ్ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి దాడి చేశారు. ఇందులో ఉన్న విటులు గుంటూరుకు చెందిన ప్రదీప్, జగద్గిరిగుట్టకు చెందిన అనిల్, రాహుల్, ఇద్దరు సెక్స్‌వర్కర్లతోపాటు నిర్వాహకులు శంకర్ నాయక్, సరస్వతిని అదుపులోకి తీసుకున్నారు. ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య

అమీర్‌పేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజు రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన దేవి(23) జయంత్ లాల్ దంపతులు. కొంతకాలం క్రితం నగరానికి వచ్చారు. జయంత్ లాల్ అమీర్‌పేట అన్నపూర్ణ బ్లాక్ రెండో అంతస్తులో కంప్యూటర్ పరికరాలు(స్పేర్ పార్ట్స్) విక్రయించే వ్యాపారం చేస్తూ సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. వివాహం అయినప్పటి నుంచి అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. బుధవారం ఎప్పటిలాగే షాపునకు వెళ్లి మధ్యాహ్నం భోజనం చేసేందుకు వచ్చాడు. దేవి ఉరేసుకుని కనిపించింది. అప్పటికే మృతిచెందినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. రాజస్థాన్‌లో ఉండే దేవి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. గాంధీ ఆస్పత్రికి చేరుకున్న మృతురాలి సోదరుడు కృష్ణ తన బావ వేధింపులు భరించలేక సోదరి ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు జయంత్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

మానవహారాన్ని విజయవంతం చేయండి : శ్రీధర్

చిలకలగూడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ ధ్రువీకరణ బిల్లుకి వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం 10.30కి టాంక్‌బండ్ వద్ద నిర్వహించనున్న మానవహారంలో పెన్షనర్లు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్.శ్రీధర్, జోనల్ కార్యదర్శి పి.యుగంధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ బిల్లుతో పెన్షనర్స్‌కి తీవ్ర అన్యాయం జరుగుతుందని, దాని ప్రభావం వివిధ రాష్ట్రాల పెన్షనర్లపై పడే అవకాశాలున్నాయని వారు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం


పుష్ప

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీష్‌గఢ్ ప్రాంతానికి చెందిన భగవత్ ప్రసాద్, భార్య పుష్ప(30) కలిసి బతుకు దేరువు కోసం కొన్ని నెలల క్రితం హైదరాబాద్ వచ్చి హయత్‌నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఛత్తీష్‌గఢ్‌లోని తన సొంతూరుకు వెళ్లేందుకు భర్త, రెండేళ్ల బాబుతో కలిసి ఆమె మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. సికింద్రాబాద్ నుంచి వెళ్లాల్సిన దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరడానికి సమయం ఉందని భర్తను వెయింటింగ్ హాలులో కూర్చోబెట్టిన పుష్ప బాబుతో కలిసి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆ రోజు రాత్రి వరకూ భార్య కనిపించకపోవడంతో భర్త అదే రోజు సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లపై డ్రైనేజీ మురుగు

- రెండుమూడు రోజులకోసారి ఇదే పరిస్థితి

రాంగోపాల్‌పేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్ పీజీ రోడ్డులోని వెస్లీ జూనియర్ కాలేజ్, మమతా స్వీట్ హౌస్ మధ్య ఉన్న సందులో డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగి మురుగు నీరు రోడ్లపై పారుతోంది. ఓ వైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురుకు డ్రైనేజీ మురుగు నీరు తోడవడంతో మెక్లోడ్‌గూడ మొత్తం మురుగు నీటితో నిండిపోయింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రెండు, మూడు రోజులకోసారి ఇలా డ్రైనేజీ మురుగు నీరు పొంగి పొర్లుతుందని బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.


పీజీ రోడ్డు సందులో పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్